
ప్రజాశక్తి
మంగళవారం 19 మార్చి 2024
5
విజయనగరం



తొలిరోజు ప్రశాంతం



జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రతీ విద్యార్థిని సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు 97.68 మంది మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.



ఇంటి వెనుక ఆధారాలు సేకరిస్తున్న విశాఖ సిపి రవిశంకర్

తలుపు తెరిచేందుకు చేసిన రంధ్రాలు

చెడ్డీగ్యాంగ్ హల్‌చల్

- సత్యనారాయణపురంలో దొంగతనానికి యత్నం
- అడ్డుకున్న వ్యక్తిపై రాడ్లతో దాడి.. పరిస్థితి విషమం
- విశాఖలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలింపు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన విశాఖ సిపి
- గ్యాంగ్‌ను పట్టుకోవడానికి ఆరు బృందాలు ఏర్పాటు
- క్లూస్ టీమ్, పోలీస్ డాగ్‌తో ఆధారాల సేకరణ

మండలంలోని చింతలవలస ఐదో బెటాలియన్ మెయిన్ గేట్‌కి ఎదురుగా ఉన్న సత్యనారాయణపురంలో ఆదివారం అర్ధరాత్రి చెడ్డీ గ్యాంగ్ హల్‌చల్ చేసింది. ఒక ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసింది. రూమ్‌లో నిద్రిస్తున్న భార్యాభర్తలను భయపెట్టి వారి వద్ద ఉన్న నగలను దోచుకోవడానికి ప్రయత్నించింది. ఈ సమయంలో వారు కేకలు వేయడంతో భర్తను రాడ్లతో కొట్టి పరారయ్యారు. చెడ్డీగ్యాంగ్ ఘటనతో జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..

ప్రజాశక్తి - డెంకాడ

సత్యనారాయణపురానికి చెందిన యారపాటి రమణమూర్తి దంపతులకు లక్ష్మీభరద్వాజ్ అనే కుమారుడు ఉన్నాడు. భరద్వాజ్‌కు ఏడాది క్రితం పెళ్లయింది. కుమారుడు, కోడలు ఒక గదిలో నిద్రిస్తుండగా, మరో గదిలో ఇంటి యజమాని రమణమూర్తి, తన భార్య నిద్రిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో వీరి ఇంట్లో నలుగురి గ్యాంగ్ చొరబడింది. ఇద్దరు బయట ఉండగా, మరో ఇద్దరు ప్రధాన ద్వారానికి మిషన్‌తో రంధ్రం పెట్టి లోపలి గడియను తొలగించారు. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి భరద్వాజ్ దంపతులు నిద్రిస్తున్న రూమ్‌లోకి వెళ్లారు. అలజడి కావడంతో కోడలికి మెలకువ వచ్చింది. వెంటనే పక్కనే ఉన్న భర్తకు చెప్పింది. భర్త నిద్ర లేచి దొంగలను చేసి కేకలు వేయడంతో వారి వద్ద ఉన్న రాడ్లతో భరద్వాజ్ తలపై తీవ్రంగా కొట్టారు. ఇంతలో ఎదురుగదిలో నిద్రిస్తున్న తండ్రి రమణమూర్తి, తల్లి లేచి కరెంటు సమస్యో ఏమో అనుకుని మీటర్ స్విచ్ ఆఫ్ చేశారు. ఈ చీకట్లో దొంగలు బయటకు వెళ్లిపోయి, మళ్లీ లోపలికి వచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు నలుగురూ కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే వస్తువులేవీ చోరీకి గురికాలేదు.

అంతా ప్లాన్ ప్రకారమే..

ముందుగా గ్యాంగ్ ప్లాన్ ప్రకారం ఇంటికి రావడానికి ఇనుప కంచె కట్టర్‌తో కట్ చేసి ముందుగా తోవ ఏర్పాటు చేసుకున్నారు. చుట్టుపక్కల ఉన్న ప్రతి ఇంటి తలుపులకు ముందుగానే దొంగలు బయట గడియలు పెట్టేశారు. అనంతరం ఇంట్లోకి దొంగతనానికి ప్రవేశించి అడ్డు వచ్చిన భరద్వాజ్‌పై దాడి చేశారు. గాయాలపాలైన భరద్వాజ్ స్పృహ కోల్పోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఇలాంటి దొంగతనం ఈ ప్రాంతంలో తొలిసారి జరగడంతో



చోరీ యత్నం జరిగింది ఈ ఇంట్లోనే..

ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సిపి రవిశంకర్ పరిశీలన

ఈ గ్రామం పద్మనాభం మండలం, విశాఖపట్నం అర్బన్‌లో ఉంది. దీంతో సంఘటనా స్థలాన్ని విశాఖపట్నం సిపి రవిశంకర్, జాయింట్ కమిషనర్ పకీరప్ప, డిసిపి-1 విజయ మణికంఠ, క్రైమ్ డిసిపి వెంకటరత్నం.. సోమవారం ఉదయం పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ వచ్చి ఆధారాలను సేకరించింది. దొంగతనం గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఆరు బృందాలు ఏర్పాటు

దొంగలను పట్టుకునేందుకు ఆరుగురు సిఐల ఆధ్వర్యంలో ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో రామభద్రపురంలో రెండు రోజుల క్రితం జరిగిన దొంగతనం... తాజాగా సత్యనారాయణపురం ఘటన ఒకే మాదిరిగా ఉన్నాయని, ఈ రెండు చోరీలకు ప్రయత్నించిన వారు ఒకే గ్యాంగ్ అని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది చెడ్డీగ్యాంగ్ పనేనని పోలీసులు తెలిపారు. ఒకప్పుడు ఇంట్లో ఎవరూ లేకపోతే దొంగతనాలు జరిగేవని ఇప్పుడు ఇంట్లో మనుషులున్నా దొంగలు ప్రవేశించి అడ్డొస్తే వారిపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసు బెటాలియన్‌కు కూతవేటు దూరంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులను కొట్టి దొంగతనానికి పాల్పడడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఉండేదని, ఇప్పుడు అటువంటిదేమీ కనబడకపోవడంతోనే ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీసు గస్తీని పెంచాలని పలువురు కోరుతున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న డాగ్‌స్క్వాడ్





చీపురుపల్లి.. ప్రస్తుతం జిల్లాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించిన అసెంబ్లీ నియోజకవర్గమిది. టిడిపి, వైసిపి శ్రేణుల్లోనైతే హాట్‌టాపిక్‌గా మారింది. అందుకు కారణం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో వైసిపి నుంచి ఎమ్మెల్యే బరిలో మంత్రి బొత్స సత్యనారాయణ దిగడం ఖాయమైంది. అటు టిడిపి నుంచి 'బలమైన అభ్యర్థి' అంటూ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును పోటీకి సిద్ధం చేస్తున్నారనే ప్రచారం రాష్ట్ర వ్యాప్తంగా చక్కర్లు కొడుతోంది. గంటా కూడా ఎక్కడా సీటు దొరక్కపోతే ఇక్కడి నుంచి పోటీకి సిద్ధమవుతున్నారనే చర్చ ఊపందుకొంది. అందుకు తగ్గట్టు ప్లాన్-బి వ్యూహాన్ని కూడా గంటా శ్రీనివాసరావు సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

ఎక్కడా లేకుంటే ఇక్కడే?

వ్యూహానికి పదును పెడుతున్న గంటా

అంతర్గత సర్వేలో చీపురుపల్లిలో పోటాపోటీ

సానుకూల అంశాలపై ఆరా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన టిడిపి, జనసేన కూటమి.. చీపురుపల్లి, శృంగవరపుకోటలో మాత్రం ఇంకా ఎటూ తేల్చుకోలేకపోతోంది. శృంగవరపుకోటలో పరిస్థితి వేరు. కానీ చీపురుపల్లిలో మాజీమంత్రి గంటా శ్రీనివాసరావును బరిలో దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగింది. భీమిలి లేదా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏదో ఒక నియోజకవర్గంలో అవకాశం దక్కకపోతే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు చీపురుపల్లి నుంచే అనివార్యంగా పోటీచేయనున్నట్లు తెలిసింది. అందుకనుగుణంగా ప్లాన్ -బి వ్యూహాన్ని కూడా గంటా ఇప్పటికే రచించారట. చీపురుపల్లిలో గంటానే తగిన అభ్యర్థి అంటూ అంచనా వేయడాన్ని బట్టి మంత్రి బొత్స సత్యనారాయణ చాలా బలమైన అభ్యర్థి అనేది టిడిపి పరోక్షంగా అంగీకరించినట్టే లెక్క. ఇటువంటి స్థానంలో గంటా మాత్రం ఎందుకంత ఈజీగా వచ్చేస్తారన్నది రాజకీయ నాయకుల విశ్లేషణ. అందుకు తగ్గట్టే ఆయన కూడా భీమిలి నియోజకవర్గంలో పోటీకి ఉత్సాహం చూపుతున్నారట. అక్కడ కాకపోతే చోడవరం, లేదా ఇంకో స్థానం అంటూ పార్టీ అధినేతకు ఆప్షన్ కూడా చూపిస్తున్నట్టుగా టిడిపి సీనియర్లలో చర్చ నడుస్తోంది. ఇంతవరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రమే పోటీచేశానని, చీపురుపల్లిలో అయితే నాన్ లోకల్ సమస్య, సామాజిక పరంగా ప్రతికూల వాతావరణం ఉంటుందని అధిష్టానం ఎదుట చెప్తున్నారట. వాస్తవానికి గంటా ఇంత వరకు తాను కోరుకున్న స్థానం తొలి జాబితాలోనే వచ్చేసేది. మారిన రాజకీయ పరిస్థితుల రీత్యా ఎంతటివారైనా కోరుకున్న చోట కాకుండా, అధిష్టానం ఆదేశించిన చోట నుంచే బరిలో దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుకు గంటా కూడా మినహాయింపు కాకపోవడంతో చివరి వరకు ప్రయత్నించి, ఫలించకపోతే అధిష్టానం చెప్పిన విధంగా చీపురుపల్లి వైపు దారి చూసుకునే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓడినా, గెలిచినా... అధికారంలోకి వచ్చినా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీలో గానీ, ప్రభుత్వంలో గానీ తన స్థానాన్ని ఎప్పటి మాదిరిగా పదిలం చేసుకునేందుకే గంటా శ్రీనివాసరావు తుదిపోరాటం సాగుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీన్ని బట్టి బహుసా ఎమ్మెల్యేగా ఓడినా ప్రభుత్వం ఏర్పడితే మంత్రి వర్గంలో స్థానం ఉండే విధంగా హామీ పొందేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా అర్థమౌతోంది. చీపురుపల్లి నుంచి పోటీచేయడం అనివార్యమైతే ఆలస్యంగా పనిలో దిగామనే పరిస్థితి లేకుండా గంటా తన సొంత మనుషులతో అంతర్గత సర్వేలు చేసుకుంటున్నట్టు సమాచారం. బొత్సతో ఢీకొంటే గట్టి పోటీ ఉంటుందని, పరిస్థితులను అనుకూలంగా మలుచుకోగలిగితే సానుకూలంగా ఉంటాయని ఆయన సొంత సర్వే రిపోర్టుల్లో వచ్చిందట. అందుకే చివరి క్షణాల్లో అనివార్యంగా వెళ్లాల్సి వస్తే అప్పటికప్పుడు ఇబ్బంది పడకుండా గంటా చాపకింద నీరులా తన వ్యూహానికి పదును పెట్టినట్టుగా తెలుస్తోంది.

పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎస్‌పి దీపిక కథనం ప్రకారం.. జామి మండలం ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన ఆబోతుల సత్తిబాబు అదే గ్రామంలో బాలికపై లైంగిక నేరానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు జామి ఎస్ఐ వీరబాబు పోక్సో చట్టం కింద గతేడాది సెప్టెంబరు 20వ తేదిన కేసు నమోదు చేశారు.

డిఎస్‌పి గోవిందరావు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి నిందితుడికి ఏడేళ్ల కారాగార శిక్ష, రూ.3500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్‌పి దీపిక అభినందించారు.



కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

రెండో రోజు యాత్రికుల తాకిడి

కిటకిటలాడిన కనకమహాలక్ష్మమ్మ ఆలయం

ప్రజాశక్తి-చీపురుపల్లి

కనక మహాలక్ష్మి అమ్మవారి జాతరకు రెండో రోజైన సోమవారం కూడా యాత్రికుల తాకిడి ఎక్కువైంది. సోమవారం ఉదయం నుంచే యాత్రికులు ఆలయాన్ని సందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన జనాలకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలను కల్పించింది. ఇఒ జి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు నిరంతర పర్యవేక్షణ చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న బొత్స దంపతులు

కనకమహాలక్ష్మి అమ్మవారిని మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బొత్సతోపాటు ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మి, కుమారుడు బొత్స సందీప్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశరావు, వైస్ చైర్మన్ సూరు కుమార్.. బొత్స కుటుంబానికి ప్రసాదాన్ని అందజేసారు. కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మీసాల వరహాలనాయుడు, ఎఎంసి చైర్మన్ దన్నాన జనార్ధనరావు, బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి

కలెక్టర్ నాగలక్ష్మి • లక్ష్మింపేటలో ఓటర్లకు భరోసానిచ్చిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-వంగర

ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. అతి సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందిన వంగర మండలం లక్ష్మింపేటలో సోమవారం ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో కలెక్టర్, ఎస్‌పి దీపిక పాల్గొని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు భరోసానిచ్చారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు.

సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. అందుకు తగిన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. గతంలో జరిగిన సంఘటనలను పునరావృతం కానీయబోమని హామీ ఇచ్చారు. ఓటర్లు భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వంద శాతం వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ స్థాయి అవగాహనా గ్రూపులను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతీ పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీసు శాఖ నుంచి కూడా మరో సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. ఓటు వేయడంలో ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఈ గ్రూపు సభ్యులకు, సెక్టార్ అధికారులకు లేదా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్‌పి దీపిక మాట్లాడుతూ సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఓటు వేయడంలో ఏమైనా సమస్యలు ఎదురవుతాయని భావిస్తే, నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. గత ఎన్నికలో జరిగిన వివాదాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలను చేపట్టామన్నారు. దీనిలో భాగంగా కొందరిని బైండోవర్ కూడా చేశామన్నారు. సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ ఆర్ఒ జోసెఫ్, ఆర్‌డిఒ బి.శాంతి, డిఎస్‌పి చక్రవర్తి, సిఐ శ్రీనివాస్, తహశీల్దార్ టి.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.



వంగర.. లక్ష్మింపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

రేగిడి : మండలంలోని కాగితావలస పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రంలో కనీస వసతులను తనిఖీ చేశారు. అక్కడి ఓటర్ల సంఖ్య, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ఓటర్లకు పోలింగ్ రోజు ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ లేని పోలింగ్ బూత్ లకు చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తనిఖీలో ఎస్‌పి దీపిక, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్‌డిఒ బి.శాంతి, తహశీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, ఉన్నతాధికారులు

నగరంలో ఫ్లాగ్‌మార్చ్

విజయనగరంకోట : నగరంలో ఎస్‌పి దీపిక ఆధ్వర్యాన పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, ట్రెయినీ ఐఎఎస్ మండ జావలి అల్ఫాన్స్, కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ కవాతు కోట జంక్షన్ నుంచి సిఎంఆర్ కూడలి వరకు సాగింది.

మోడీ.. రైతు, కార్మిక వ్యతిరేకి

ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధాని మోడీ.. రైతు, కార్మికుల వ్యతిరేకి అని, మోడీని, బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా కోరారు. సోమవారం విజయనగరం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతుధరను గ్యారెంటీ చేస్తూ నేటికీ చట్టం చేయని కారణంగానే తిరిగి రైతాంగం ఆందోళన చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని, అదనపు పనిభారాలు మోపి కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేస్తోందని ధ్వజమెత్తారు. ధరలు, పన్నుల భారాలు పెంచుతూ వేతనాల్ని పెంచనివ్వడం లేదన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న బిజెపిని ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జె.కిశోర్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకర్రావు, రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించాలి

టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. వైసిపి, కాంగ్రెస్ వేరు కాదని, ఈ రెండు పార్టీలు ఒకే కుటుంబానికి చెందినవని తెలిపారు. జగన్ రెడ్డి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, అధికారం నుంచి దింపాలని అనుకుంటున్నారని తెలిపారు. వైసిపి మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

స్పందనను కొనసాగించాలి

కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కోరారు. అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందనను ఎప్పటిలానే నిర్వహించాలన్నారు. ప్రజలు సమస్యలపై విన్నవించుటకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిడిపి పట్టణ కార్యదర్శి బంగారు బాబు, విజ్జపు ప్రసాద్, పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

క్రమబద్ధంగా కంట్రోల్ రూమ్ పనితీరు

విజయనగరంకోట : కంట్రోల్ రూమ్‌లోని వారంతా క్రమబద్ధంగా పని చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం కలెక్టర్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి కాల్స్ వస్తున్నదీ, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరా తీశారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్ నెంబర్ల వద్ద నిత్యం కాల్స్‌కు హాజరు కావాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో నంబర్లకు మోడల్ కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి బాలాజీ, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న న్యాయమైన పోరాటానికి మిమ్స్ ఆసుపత్రి వైద్యులు మద్దతు ఇచ్చి సహకరించాలని మిమ్స్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ఎం.నారాయణ రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. సోమవారం విజయనగరంలోని మిమ్స్ హెల్త్‌కేర్ సెంటర్ వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యాన ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడికి వచ్చిన వైద్యులకు వినతులు ఇచ్చి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిమ్స్‌లో 20 సంవత్సరాలుగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి శక్తి మేరకు కృషి చేసిన ఉద్యోగులు నేడు అనేక రకాల సమస్యలతో సతమతం అవుతున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని అడిగిన వారిపై క్రమశిక్షణ చర్యలు పేరుతో తొలగించడం, బదిలీ చేయడం, గేటు దగ్గర ఆపేయడం చేస్తూ కక్ష సాధింపులకు దిగుతున్నారన్నారు. కోవిడ్ కాలంలో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేసినా, 2020 అక్టోబర్ నుంచి నేటి వరకు మొత్తం 7 డిఎలు ఇవ్వలేదన్నారు. 2019 నుంచి వేతన ఒప్పందం చేయలేదని, జనవరి నెల జీతం నేటికీ చెల్లించలేదని చెప్పారు. చివరికి సెలవులు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఫిబ్రవరి ఒకటో తేది నుండి ఉద్యోగులంతా పోరాడుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమ పోరాటానికి అండగా ఉండాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మిమ్స్ ఉద్యోగులు

పంప్‌హౌస్ కార్మికుల బకాయి జీతాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పంప్‌హౌస్ కార్మికులకు 2022 మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు చెల్లించాలని, ఇంజినీరింగ్, ఆప్కోస్ కార్మికులకు సంక్రాంతి పండుగ కానుక డబ్బులు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంప్‌హౌస్ కార్మికులకు ఇవ్వాల్సిన రెండు నెలలు బకాయిలు చెల్లించలేదని అన్నారు. ఇప్పటికే అనేక సార్లు అధికారులకు విన్నవించినా వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు, ఆప్కోస్ ఇతర కార్మికులకు సంక్రాంతి కానుక డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

'కొప్పల వెలమలకు ఎంపి టిక్కెట్లు ఇవ్వాలి'

ప్రజాశక్తి- బొబ్బిలి

ఉత్తరాంధ్రలో అధిక జనాభా కలిగిన కొప్పుల వెలమ సామాజికవర్గానికి టిడిపి విజయనగరం, అనకాపల్లి ఎంపి టిక్కెట్లు ఇవ్వాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల జగన్ కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడారు. వెలమలకు ప్రాతినిధ్యం రావలసిన ఎమ్మెల్యే, ఎంపి లాంటి రాజ్యాంగ పదవులు దక్కకుండా పోతున్నాయన్నారు. తమ సామాజిక వర్గం హక్కులు సాధన కోసం దేశ పార్లమెంట్‌లో కేసిన వాణి వినిపించేందుకు, టిడిపి ఇంతవరకు ప్రకటించని అనకాపల్లి, విజయనగరం ఎంపి టిక్కెట్లను టిడిపిలోనే సీనియర్లుగా వున్న ఎవరికైనా కేటాయించాలని కోరారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి కోరారు. పోషణ పక్వాడ పై ఐసిడిఎస్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనత కోసం ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేస్తామని రూరల్ అంగన్వాడీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

టిడిపి నాయకులకు వైసిపి సవాల్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐదేళ్లలో అనేక అవినీతి జరిగిందని టిడిపి నాయకురాలు అదితి గజపతిరాజు చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని, ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ఎంపిపి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి కెల్ల శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు జమ్ము శ్రీను సవాల్ విసిరారు. సోమవారం మండలంలో వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గోబెల్స్ ప్రచారం చేయడం టిడిపి నాయకులకు వారసత్వంగా వస్తోందని ఎద్దేవాచేశారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని టిడిపి నాయకులు చెప్పడాన్ని ఖండించారు. ఐదేళ్ల తర్వాత అదితి గజపతిరాజు వచ్చి చెట్టు కింద ఉన్నవారు చెప్పింది మాట్లాడటం సరికాదని హితవుపలికారు. అవాస్తవాలు మాట్లాడటం సరికాదని, దీనివల్ల తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న టిబి యూనిట్ సూపర్‌వైజర్ శ్రీదేవి

క్షయపై అప్రమత్తం

ప్రజాశక్తి - రామభద్రపురం

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. సోమవారం ఇట్లా మామిడిపల్లిలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ టీబీ వారోత్సవాల్లో భాగంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలుపుతూ ఈ వ్యాధి లక్షణాలు వివరించారు. 2 వారలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలో ఉండే ఆసుపత్రికి వెళ్ళి రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి ప్రమాదకరం కాదని సకాలంలో మందులు వాడితే తగ్గుముఖం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అయ్యన్నపేటకు చెందిన ఎం.చైతన్య అనే బాలుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. విశాఖలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్.. సోమవారం ఆ బాలుడిని పరామర్శించారు. విరాళాలుగా సేకరించిన రూ.35,500ను చైతన్య తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఆర్.డి ప్రసాద్, సంఘ సభ్యులు నూతన్, ఝాన్సీ, శ్రావణి, సుజాత పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి పి. బాల భాస్కరరావు సోమవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు, విద్యార్థులకు ఇస్తున్న భోజనాలు, ఇంగ్లీషు, తెలుగు వర్క్ బుక్స్, ఉపాధ్యాయులు డైరీలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ అర్జునరావు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ

నేరాలు ఘోరాలు

పిచ్చికుక్క స్వైర విహారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా గల శ్రీనివాస కోలనీ వీధిలో పిచ్చి కుక్క ఇద్దరు చిన్నారులను సోమవారం కరిచింది. హృషీకేశ్ (10) పాఠశాలకు వెళ్ళేందుకు చెప్పుల బెల్టు పెట్టుకుంటుండగా అకస్మాత్తుగా పిచ్చి కుక్క దాడిచేసి కుడి మోకాలికి ఎగువన, ఎడమ చూపుడు వేలి పైన కరిచింది. అప్పుడే పాఠశాల వాహనం దిగి తన ఇంటిలోకి ప్రవేశిస్తున్న నేహ(7)ను కూడా కుడి కాలు పై అంగుళం మేర గాటుపడేలా కరిచింది. ఆ పాప తల్లి దంత వైద్యురాలు కావడంతో తన క్లినిక్‌లోనే ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆసుపత్రిలో వీరికి వైద్యం చేసి ఇంటికి పంపారు.

102 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని గూడెపువలస గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండడంతో సోమవారం అరెస్ట్ చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. గూడెపువలస గ్రామానికి చెందిన కొండపు రామనాయుడు అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు తనిఖీ చేయగా ఆయన ఇంటి వద్ద నుంచి 102 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని రిలయన్స్‌మాల్ ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి వేలాడుతూ ఉంది. సోమవారం ఉదయం వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి విఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వయస్సు 40 నుంచి 45 ఏళ్ళ ఉంటుందని ఎస్ఐ హరిబాబునాయుడు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

తొలి రోజు ప్రశాంతం

●పదో తరగతి పరీక్షలు ప్రారంభం

●గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభ సమయం కాగా, ఆయా కేంద్రాలకు విద్యార్థులు 8.30 గంటలకే చేరుకున్నారు. మొదటి సారి పబ్లిక్ పరీక్షలు రాస్తుండటంతో విద్యార్థులు వెంట తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వచ్చి ఆల్ ద బెస్ట్ తెలియజేశారు. ప్రతి విద్యార్థినీ తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైంది.

తొలి రోజు 97.68 శాతం హాజరు

తొలిరోజు పదో తరగతి తెలుగు పరీక్షకు 97.68 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 24,726 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 24,152 మంది పరీక్ష రాశారు. 574 మంది గైర్హాజరైనట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చెప్పారు.

రేగిడి: మండలంలోని సోమవారం తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సంకిలి, లక్ష్మీపురం, రేగిడి, ఉంగరాడ వెంకటాపురం హై స్కూల్లో 558 మందికి గాను, 553 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు వెల్లడించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.



రేగిడి: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



వేపాడ: స్కూల్‌లో పరీక్షా కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

రామభద్రపురం: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు సెంటర్లలో రెగ్యులర్ విద్యార్థులు 536 మందికి గాను 530 మంది హాజరైనట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్‌గా రాస్తున్న 12 మందికి గాను 5 మంది హాజరు కాగా 7గురు గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు.

వేపాడ: పదో తరగతి పరీక్షలు మండలంలోని వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విక్టరీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, కొండ గంగుపూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలోనూ ప్రశాంతంగా నిర్వహించారు. తొలి రోజు 354 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనా జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగిందని హెచ్‌ఎం శ్రీవల్లి తెలిపారు.

గుర్ల: మండలంలో మూడు పరీక్ష కేంద్రాలలో పదోవతరగతి పరీక్షలు నిర్వహించినట్టు ఎంఇఒ ఎస్ భానుప్రకాష్ తెలిపారు. పరీక్షలు రాయడానికి 476 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 470 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. వీరిలో 22 మంది ప్రయివేటు విద్యార్థుల్లో ఆరుగురు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. ఉదయం ఛీఫ్ ఎగ్జామినేషన్ అధికారి సమక్షంలో పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్న పత్రాలను తీసుకొని పరీక్ష కేంద్రాలకు అంద చేశామని చెప్పారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ స్కూల్, తెర్లాం జెడ్పి స్కూల్లో మొత్తం 550 మంది పిల్లలకు గాను 536 మంది పరీక్షకు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించామని ఎంఇఒ త్రినాధరావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎస్ఐ ఆర్ రమేష్ పర్యవేక్షించారు.

కొత్తవలస: మండలంలో సోమవారం నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. 963 మంది విద్యార్థులకు గాను 954 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు.



హాల్ టిక్కెట్లు నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

లక్కవరపుకోట: పదోతరగతి తొలిరోజు తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో 515 మంది పరీక్షలు రాశారు. ఇన్విజిలేటర్లతోపాటు స్థానిక ఎంఇఒలు సింహాచలం, కూర్మారావు, జి శ్రీనివాసరావు, ఎస్ఐ ఆర్.గోపాలరావు, విజయనగరం డైట్ వైస్ ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

గిరిజన నాయకుడిపై దాడి హేయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు జరతా గౌరీస్ పై ఉపాధ్యాయురాలు, ఆమె భర్త చేసిన దాడి హేయమైన చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు అన్నారు. గిరిజన నాయకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో, ఎంఇఒ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని దారపర్తి పంచాయతీ పల్లపు దుంగాడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలకు హాజరు కాకున్నా ఒక ప్రైవేటు వ్యక్తిచే పాఠశాలను నడిపిస్తున్నారని గిరిజన సంఘం నాయకుడిగా ప్రశ్నించినందుకు ప్రధానోపాధ్యాయురాలు, ఆమె భర్త కలిసి గిరిజన సంఘం నాయకుడి పై దాడి చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. గౌరీష్ గతంలో ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పని చేసే వారిని ప్రస్తుతం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజన సంఘంలో పనిచేస్తున్నారని చెప్పారు. గిరిజన గ్రామాలలో విద్యకు దూరమవుతున్న గిరిజనులు పట్ల చలించి స్థానికుడైన ఓ గిరిజన వ్యక్తిగా గిరిజన హక్కులకై పోరాటం చేస్తూ ఉపాధ్యాయుల దుర్మార్గాన్ని నిలదీశాడని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడని అక్కడ పాఠశాల హెచ్ఎం తన భర్తను తీసుకొచ్చి గౌరీష్ పై దాడి చేయించారన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ భౌతికదాడికి దిగారాని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తికే అవమానం చేకూరుస్తున్న ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయాలని లేనిపక్షంలో ఏపీ గిరిజన సంఘం, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానికులను కలుపుకొని ఈ దుర్మార్గం పై పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడు గౌరీషు, గిరిజన సంఘం నాయకులు రమసాల శివ, సిపిఎం పార్టీ సభ్యులు చెలికాని ముత్యాలు పాల్గొన్నారు.



ఫిర్యాదును అందిస్తున్న సిపిఎం, గిరిజన సంఘ నాయకులు


మధ్యాహ్న భోజన ఏజెన్సీ రద్దు

త్రిసభ్య కమిటీ సిఫార్సుతో వర్కర్ల ఆందోళన

ప్రజాశక్తి - జామి

సీతానగరం మధ్యాహ్న బోజన ఏజెన్సీ రద్దు చేసి, కొత్త ఏజెన్సీని ఏర్పాటు చేయమని త్రిసభ్య కమిటీ సిఫార్సు చేసింది. ఇటీవల ఆ ఏజెన్సీలో పనిచేస్తున్న కార్మికులను ఉదయాన్ని తొలగించామని చెప్పడం, సాయంత్రానికి కాదు కాదు విధులకు హాజరు కావాలని అనడం వంటి అధికారుల చర్యలు వర్కర్లను గందరగోళానికి గురి చేసిని విషయం తెలిసిందే. అయినప్పటికీ అక్కడితో వివాదం ముగిసింది. మళ్లీ ఇప్పుడు ఏజెన్సీ రద్దుతో మరోసారి మధ్యాహ్న బోజన ఏజెన్సీ వివాదం తెరపైకి రావడంపై ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

అర్థాంతరంగా మధ్యాహ్నన్న బోజన ఏజెన్సీ రద్దు చేస్తూ, మండల త్రిమెన్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 30 ఏళ్లుగా అదే పని చేస్తూ బతుకుతున్న మహిళలు రోడ్డున పడే అవకాశముందనీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిర్వహులకు సిఐటియు అండగా నిలిచింది. తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో త్రిసభ్య కమిటీ ఏజెన్సీ రద్దు సిఫార్సుపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. వాస్తవానికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ఏర్పాటు, రద్దు చేయడం వంటి అంశాలు పూర్తిగా ఆర్ఒ పరిధిలోకి వెళ్ళిపోతాయని మరో వాదన వినిపిస్తుంది. ఒకవేళ కార్మికులు తొలగించి కొత్త వారిని నియమిస్తే, ఊరుకునేది లేదని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.



PROCEEDINGS OF THE THREE MEN COMMITTEE, JAMI MANDAL
VIZIANAGARM DIST

రద్దు పత్రం

అభివృద్ధి చేశాం.. ఆదరించండి: ఎమ్‌పి

ప్రజాశక్తి- చీపురుపల్లి

జిల్లాతో పాటు చీపురుపల్లి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసామని తమను ఆదరించాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని మెట్ట పల్లి, పత్తికాయవలస గ్రామాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసామని, కోట్లాది రూపాయలను నియోజకవర్గానికి తీసుకు వచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ, తాను కలిసి చేసామని గుర్తు చేశారు. రానున్న ఎన్నికలలో తనతో పాటు బొత్స సత్యన్నారా యణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాల నాయుడు, దన్నాన జనార్ధనరావు, చందక శ్రీనివాసరావు, మీసాల ఈశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

జాతర పేరిట వసూళ్లకు లెక్క చెప్పాలి

ప్రజాశక్తి - జామి

ఎల్లారమ్మ జాతర పేరిట ప్రజల నుంచి వసూలు చేసిన ప్రతి ఒక్క రూపాయికీ ప్రజలకు లెక్క చెప్పాలని మాజీ జెడ్‌పిటిసి బివిఎస్ఎస్ ప్రకాష్ రావు (పెదబాబు) డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్‌కి సోమవారం ఫిర్యాదు చేశారు. పండుగ నిర్వహణ పేరిట గ్రామంలో కిళ్లీ బడ్డీ మొదలు కొని ప్రభుత్వ ఉద్యోగులు, కార్యాలయాల నుంచి విచ్చల విడిగా లక్షలు వసూలు చేశారని కమిషనర్‌కు వివరించారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుకు ఖచ్చితంగా లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల ముసుగులో ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుకు ప్రజలకు లెక్క చెప్పినప్పుడే జవాబుదారీ అనిపించుకుంటుందని అన్నారు. ఇవి కాకుండా, గుడి ఆదాయం నుంచి కొంత మంది రాజకీయ పెద్దల ఒత్తిడితో కొన్ని లక్షలు గుంజుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వసూళ్లపై విచారణ జరిపి, ఆలయం ఆదాయం కాపాడాలని కోరారు. అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోని యెడల న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న పెదబాబు

టిడిపితోనే అభివృద్ధి : కొండపల్లి

ప్రజాశక్తి- బొండపల్లి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాబోవు ఎన్నికలలో గజపతినగరం నియోజకవర్గంలో టిడిపిని గెలిపించాలని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండలంలోని గిట్టుపల్లి, కనిమెరక గ్రామాలలో ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందన్నారు. ఈ పరిస్థితిలలో ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ముదునూరు శ్రీనువాస రాజు, మీసాల జానకీ రావు, ఎంపిటిసి పడాల సుజాత, మాజీ ఎంపిటిసి గొర్లె సత్యవతి, టిడిపి నాయకులు బండారు ప్రకాశ రావు, శనపతి శ్రీనువాస రావు, పల్లి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

గేట్‌లో ఆలిండియా 11వ ర్యాంక్

ప్రజాశక్తి- డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసిఈ చివరి సంవత్సరం చదువుతున్న అందవరపు రాకేష్ ఇటీవల ప్రకటించిన గేట్ -2024 ఫలితాల్లో ఆలిండియా 11వ ర్యాంక్ సాధించాడు. ఈ ర్యాంకు సాధించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, తనకు ఎంతో మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నానని రాకేష్ ఆదివారం తెలిపారు. తనకు మార్గనిర్దేశం చేసిన ఎంవిజిఆర్ ఈసిఈ అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది రాకేష్ ఆలిండియాలో 11వ ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.సీతారామ రాజు అన్నారు. ఏటా తమ విద్యార్థులు గేట్ ర్యాంకులు సాధిస్తూ వివిధ ఐఐటి, ఎన్ఐటిలలో ప్రవేశం పొందుతున్నారని గుర్తు చేశారు. అనంతరం రాకేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ఎం.సి శేఖర్, ఈసిఈ హెచ్ఒడి డాక్టర్ ఎస్‌కె మస్తాన్‌వలీ పాల్గొన్నారు.



రాకేష్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

'వైసిపితోనే సంక్షేమం'

ప్రజాశక్తి - రామభద్రపురం

వైసిపితోనే సంక్షేమం సాధ్యమని అందుకే మరోసారి వైసిపికి పట్టం కట్టాలని, ఎమ్మెల్యే శంబంగిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైసిపి మండల అధ్యక్షులు అప్పికొండ లక్షుంనాయుడు అధ్యక్షతన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అనునిత్యం ప్రజా సంక్షేమమే పరమావధిగా అన్ని పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా బటన్ నొక్కే ముఖ్యమంత్రి జగన్‌ను మరలా అదే పీఠంపై కూర్చో బెట్టెందుకు ఫ్యాన్ గుర్తుకు అత్యధిక ఓట్లు వేయించేందుకు ఇంటింటా ప్రచారాలు ముమ్మరం చేయాలన్నారు. త్వరలో నిర్వహించే 'మనమంతా సిద్ధం' పేరిట జరిగే బస్సు యాత్ర విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో విశాఖ డెయిరీ అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్ర శేఖర్, కటికి చిన్నారావు, జేసీఎస్ కన్వీనర్ సింహాచలం నాయుడు, నాయకులు అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

సైకో జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు ఓటర్లు సిద్ధం కావాలని జనసేన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పాలురి బాబు పిలుపు నిచ్చారు. సోమవారం ఆరికతోట గ్రామంలో ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని బ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక విధానాలను కుప్ప కూల్చి ప్రజల నెత్తిన తీవ్ర అప్పులు మిగిలించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్ని సోమరితనానికి దగ్గర చేసే దిగదుడుపు పథకాలు పంపిణీ చేశారని ఎద్దేవా చేశారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసి రాష్ట్రాన్ని అదోగతి పాలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. యువతను నిర్వీర్యం చేశారని ఇసుక, గంజాయి దందాలు చేయించి మాఫియా ముఠాలను ప్రోత్సహించి అక్రమ సంపాదన పోగేసారని ఆరోపించారు. ఇవన్నీ గ్రహించి ప్రజలంతా టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల నేత కనకల శ్యామ్, అల్లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ నిబంధనలకు విరద్ధంగా ప్రయివేటు విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి బి. రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు, ప్రచార వాహనాలను వెంటనే అడ్డుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ వరకు అడ్మిషన్స్, ప్రచార క్యాంపెయిన్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఈ నిబంధనలను ప్రయివేటు విద్యాసంస్థలు తుంగలో తొక్కుతు న్నాయని చెప్పారు. ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ, నాయకులు పోత్రాజు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వికలాంగ పిల్లలకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అంగ వైకల్యం పిల్లలకు ఫిజియోథెరపీ చేయించాలని డాక్టర్ కె. రాజ్ మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యం తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు వెంటనే మేల్కొని ఫిజియోథెరపీ జరిపిస్తే ఫలితం కనిపిస్తుందన్నారు. ముఖ్యంగా తలిదండ్రులు పిల్లల వైకల్యం పై అవగాహన కల్పించుకొని ప్రాథమిక స్థాయి నుంచి ఫిజియోథెరపీ చేయించాలని కోరారు. అలా చేయడం వల్ల త్వరగా పిల్లలు కోలుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఇఆర్‌టి బి. అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరిపి చేస్తున్న వైద్యుడు రాజ్‌మోహన్

In the Honourable Court of the District Judge at Vizianagaram (Application Under Guardians and Wards Act. 1980) G.O.P. 20/2023

Between :
మాడుగుల రమేష్ ......పిటిషినర్
And :
Nil ....రెస్పాండెంట్

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, క్రిష్ణపురం వాసి మాడుగుల రమేష్ S/o దను, మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జివారి కోర్టులో మెంటల్లి అన్ సౌండ్ అటునటువంటి బంగారి వెంకటేశ్వర రావు @ వెంకటరావు S/o లేటు అప్పారావు గార్డియన్‌గా నియమించమని G.O.P. 20/2023గా దాఖలు చేసి యున్నారు. సదరు కేసు మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జివారి కోర్టులో **తేది 27-03-2024**కి వాయిదా అయి ఉన్నది. కావున ఈ విషయమై ఎవ్వరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్నచో పై తేదీన మహారాజశ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు **ఉదయం 10-30గం॥ల**కి స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి వారి యొక్క ఆక్షేపణలు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు
యం.మురళి
పిటిషినర్ తరపున న్యాయవాది,
విజయనగరం, సెల్: 9440523720

మహారాజశ్రీ విజయనగరం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు స్పెషల్ మొబైల్ కోర్టులో OS 167/2012

బిట్వీన్ :
కంది పెంటమ్మ (డైడ్) వగైరాలు .....వాదులు
అండ్ :
కొడితల సూర్యనారాయణ (డైడ్) ....ప్రతివాదులు
To,
R 26. కొడితల రమ్య, D/o లేటు శంకరరావు, ఆదిత్యనగర్, ప్లాట్ నెం.42, నియర్ గురజాడ పబ్లిక్ స్కూల్, ఉడాకోలనీ, విజయనగరం.
R 29. కొడితల సౌమ్య, D/o లేటు శంకరరావు, ఆదిత్యనగర్, ప్లాట్ నెం.42, నియర్ గురజాడ పబ్లిక్ స్కూల్, ఉడాకోలనీ, విజయనగరం.

పై నెంబరు గల దావాలో మిమ్మల్ని చనిపోయిన 4వ ప్రతివాది అయిన కొడితల శంకరరావు గారికి మిమ్మలను వారసులుగను చేర్పించిన తదుపరి మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపిననూ అవి అన్నియూ తిరిగి వచ్చేయడం వలన కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ పత్రికా ప్రకటన మూలంగా మీకు తెలియజేయుడం ఏమనగా పై నెంబరు దావాలో మీ యొక్క వ్రాతిమూలకమైన ప్రత్యుత్తరములు చెప్పగలందులకు **2024 సం॥ మార్చి నెల 28వ తేదీన ఉదయం 10-30 గంటల**కు మీరు పై కోర్టువారి ఎదుట హాజరు కావలసియున్నదని పై చెప్పబడిన దినమున మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమందు ఆ వాజ్యములను విమర్శ చేసి తీర్మానించటము అగునని మీరు తెలుసుకోగలరు.

పి.హరగోపాల్
ఆర్.ఎస్.వాసన్
అడ్వకేట్స్, విజయనగరం